
## దుర్గమ్మకు సారె సమర్పించిన పోలీస్ కమిషనర్


2 లో


# మనం




కృష్ణా / గుంటూరు

ఎన్టీఆర్ - బాపట్ల - పల్నాడు



సోమవారం | 14 | జూలై | 2025 | పేజీలు : 3


# దుర్గమ్మకు భక్త నీరాజనం



- మధ్యాహ్నం వరకు 57 వేల 419 మంది భక్తులకు దర్శనం
- అమ్మవారికి సారె సమర్పించిన 4.15 వేల మంది భక్తులు
- భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు
- ఉచిత ప్రసాదం, అన్న ప్రసాదం
- మౌలిక సదుపాయలను పరిశీలించిన ఈవో శీనానాయక్

3 లో

-విజయవాడ పశ్చిమ, మనం న్యూస్

# దివికేగిన నటశిల్పి



- ఎన్నో రకాల పాత్రలు
- డాక్టర్ కావాలనుకుని యాక్టర్.
- కృష్ణా జిల్లా కంకిపాడు వాసి కావడం విశేషం

2 లో

-విజయవాడ తూర్పు, మనం న్యూస్




వివరాలు మెయిన్ లో

## కృష్ణమ్మ తీరాన కుంచెతో

# కోటి భావాలు

- ఉత్సాహంగా ఫ్లోర్ పెయింటింగ్, డ్రాయింగ్ పోటీలు
- వైబ్రెంట్ విజయవాడకు ఈ అడుగే గొప్ప స్ఫూర్తి
- ప్రజలను జాగ్రత్వం చేసేలా వేసిన చిత్రాలు
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

-విజయవాడ సెంట్రల్, మనం న్యూస్

# దుర్గమ్మకు సారె సమర్పించిన పోలీస్ కమిషనర్



**విజయవాడ పశ్చిమ, జూలై 13 (మనం న్యూస్):** అమ్మలగన్నయమ్మ కనకదుర్గమ్మను ఇంటి ఆడపడుచుగా భావించి ఆదివారం ఆషాఢ సారె సమర్పణ నిమిత్తం ఆలయానికి వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన భక్తులతో ఇంద్రకీలాద్రి కళ కళ లాడింది. ఇంటి ఆడపడుచుకు ఏ విధంగా సారె సంభరాలు పెడతారో అంతకంటే ఎక్కుడ భక్తి శ్రద్ధలతో భక్త బృందాలు సామాగ్రి తో తరలి వచ్చారు. అందులో బాగంగా ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు దంపతులు కూడా ఆదివారం నాడు అమ్మవారికి ఆషాడ మాస సారె అమ్మవారి ఆలయానికి తీసుకువచ్చారు. ఏ.డి.సి.పి.గుణ్ణం రామకృష్ణ, ఏసీపి, దుర్గారావు, పోలీస్ అధికారులు, సిబ్బంది సిపి దంపతులతో పాటు ఉన్నారు. దుర్గ గుడి ఈవో శీనా నాయక్ సిపి దంపతులకు సాదరంగా స్వాగతం పలికారు.

# కోటా శ్రీనివాసరావు మరణం తీరని లోటు

- **విజయవాడ ఎమ్మెల్యే సుజనా చౌదరి**



**విజయవాడ పశ్చిమ, జూలై 13 (మనం న్యూస్):** ప్రముఖ నటుడు కోటా శ్రీనివాసరావు మృతి పట్ల మాజీ కేంద్ర మంత్రి విజయవాడ పశ్చిమ శాసనసభ్యులు యలమంచిలి సత్యనారాయణ( సుజనా చౌదరి) తీవ్ర దిగ్భాంతిని వ్యక్తం చేశారు. కోటా మృతి పై సుజనా ట్విట్టర్ వేదికగా సంతాపం తెలిపారు .కళామతల్లి ముద్దుబిడ్డగా విభిన్న పాత్రలు పోషించి, తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన కోటా మరణం సినీ రంగంతో పాటు తెలుగు వారందరికీ బాధాకరమన్నారు. నాలుగు దశాబ్దాలుగా నటుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా, విలన్ గా నటించిన ఆయన రాజకీయాల్లోనూ తన సేవలు అందించారని 1999 లో విజయవాడ బీజేపీ ఎమ్మెల్యే గా గెలుపొంది ప్రజా సేవతో మంచి నాయకుడి గా పేరు సంపాదించుకున్నారని స్మరించుకున్నారు.వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థించారు. కోటా శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే సుజనా చౌదరి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# సీనియర్ నటుడు కోట శ్రీనివాసరావు కన్నుమూత



- **కృష్ణా జిల్లా కంకిపాడు వాసి కావడం విశేషం**

**విజయవాడ తూర్పు, జూలై 13 (మనం న్యూస్):** టాలీవుడ్ సీనియర్ నటుడు కోట శ్రీనివాసరావు కన్నుమూశారు. గత కొంతకాలం నుంచి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన ఆదివారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. కోట నాలుగు దశాబ్దాల సినీ జీవితంలో ఎన్నో రకాల పాత్రలు చేసి ప్రేక్షకుల్ని మెప్పించారు. కేవలం తెలుగులోనే కాదు.. తమిళం, హిందీ భాషల్లో కూడా తన సత్తా చాటారు.

## డాక్టర్ కావాలనుకుని యాక్టర్..

కోట శ్రీనివాసరావుకు కృష్ణా జిల్లాతో ప్రత్యేక అనుభందం ఉంది. ఆయన జన్మ స్థానం కూడా కృష్ణా జిల్లా కావడం విశేషం. 1942 జులై 10వ తేదీన కృష్ణా జిల్లా కంకిపాడులో జన్మించారు. కోట తండ్రి సీతా రామాంజనేయులు డాక్టర్ కావడంతో కోట కూడా మొదట్లో డాక్టర్ కావాలనే అనుకున్నారు. కానీ నటన మీద ఆసక్తితో నాటకాల వైపు వచ్చారు. సినిమాల్లోకి రాకముందు ఆయన స్టేట్ బ్యాంకులో పని చేశారు. 1978లో 'ప్రాణం ఖరీదు' సినిమాతో చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టారు. తెలుగులో చివరగా 'సువర్ణ సుందరి' అనే సినిమాలో నటించారు. 2003లో వచ్చిన 'సామి' సినిమాతో తమిళంలోకి అడుగుపెట్టారు. తమిళంలోనూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. 2018లో వచ్చిన 'కాత్తాడి' ఆయన చివరి తమిళ సినిమా. 1987లో విడుదలైన 'ప్రతిఘాత్' సినిమాతో బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చారు. 2016లో విడుదలైన 'భాగీ' ఆయన చివరి హిందీ సినిమా. కన్నడలో 1997లో వచ్చిన 'లేడీ కమిషనర్'తో ఎంట్రీ ఇచ్చారు. 2023 విడుదలైన 'కబ్జా' ఆయన చివరి కన్నడ సినిమా. కేవలం నటుడిగానే కాదు.. డబ్బింగ్ ఆర్టిస్టా, సింగర్గా కూడా కొన్ని సినిమాలకు పని చేశారు. 40 ఏళ్ల సినీ ప్రస్థానంలో 750 సినిమాల్లో నటించారు. 9 నంది అవార్డులు, సైమా అవార్డు గెలుచుకున్నారు. 2015లో పద్మశ్రీ అవార్డు అందుకున్నారు. సినిమాల్లోనే కాదు.. రాజకీయాల్లోనూ తనదైన ముద్ర వేసుకున్నారు. 1990లలో బీజేపీలో చేరారు. 1999లో విజయవాడ తూర్పు నియోజక వర్గానికి బిజెపి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

# ఫోటో జర్నలిస్టుల ఐక్యత తక్షణావశ్యకత

- **ఏపీయూడబ్ల్యూజే నేతలు చందు జనార్ధన్**



**విజయవాడ సెంట్రల్, జూలై 13 (మనం న్యూస్):** రాష్ట్రంలో ఫోటో జర్నలిస్టులపై తరచూ జరుగుతున్న దాడుల నేపథ్యంలో ఫోటో జర్నలిస్టుల ఐక్యత తక్షణ అవశ్యకత అని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) మాజీ ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్, నూతన ప్రధాన కార్యదర్శి కంచల జయరాజ్ ఉద్ఘాటించారు. విజయవాడ ప్రెస్ క్లబ్ లో జరిగిన ఏపీయూడబ్ల్యూజే అనుబంధ ఏపీ ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ (ఎపిపిజెఎ ) సర్వసభ్య సమావేశం ఆదివారం అధ్యక్షుడు విజయభాస్కర్ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న వీరు మాట్లాడుతూ ఏపీపీజేఏకి అన్ని వేళలా ఏపీయూడబ్ల్యూజే పూర్తి సహాయ సహకారాలు అందజేస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో రాజకీయ నాయకులు, మాఫియా ముఠాల నుండి ఫోటో జర్నలిస్టులు తరచూ భౌతిక దాడులకు గురికావడం పట్ల సర్వసభ్య సమావేశం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. దాడుల నివారణకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని సమావేశం విజ్ఞప్తి చేసింది. సమావేశంలో ఐ.జె.యు కౌన్సిల్ సభ్యుడు ఎస్. కే బాబు, ఏపీయూడబ్ల్యూజే విజయవాడ అర్బన్ యూనియన్ కార్యదర్శి దారం వెంకటేశ్వరరావు, ఏపీపీజేఏ గౌరవాధ్యక్షులు నారాయణ తదితరులు ప్రసంగించారు. సమావేశంలో ఏపీయూడబ్ల్యూజే నూతన ప్రధాన కార్యదర్శిగా ఇటీవల ఎన్నికైన కంచల జయరాజ్ ను ఏపీపీజేఏ నేతలు సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి పెద్ద ఎత్తున ఫోటో జర్నలిస్టులు పాల్గొన్నారు. సమావేశానంతరం రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఏపీపీజీఏ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా జీవి నారాయణరావు (ఆంధ్రజ్యోతి), అధ్యక్షులుగా సిహెచ్. విఎస్ విజయభాస్కరరావు (ఆంధ్రపత్రిక), వర్కింగ్ ప్రెసిడెంట్ గా వి.రూబెన్ బెసాలియల్( సాక్షి), ప్రధాన కార్యదర్శి జి మహేష్ (టైమ్స్ ఆఫ్ ఇండియా), కోశాధికారి సిహెచ్ నారాయణరావు(డెక్కన్ క్రానికల్ ), ఉపాధ్యక్షులు కే. గిరిబాబు (తిరుపతి మనం) మరో 12 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

# దుర్గ గుడిలో ఉచిత అన్నదానం, ఉచిత ప్రసాద పథకాలకు 1 లక్షా 52 వేలు విరాళం

**విజయవాడ పశ్చిమ, జూలై 13 (మనం న్యూస్):** రాజస్థాన్ లోని ఉదయపూర్ కు చెందిన శాంభవ సోలంకి అనే వ్యక్తి ఉచిత ప్రసాదము పంపిణీ చేయు పథకానికి 1 లక్షా 1 వెయ్యి రూపాయల చెక్కును, అన్నదానమునకు విరాళముగా 51 వేల రూపాయలకు రెండవ చెక్కును కలిపి మొత్తం 1 లక్షా 52 వేల ఆలయ కార్య నిర్వహణధికారి శీనా నాయక్ కు అందజేశారు. దాతకు అమ్మవారి దర్శనం అనంతరం వేద ఆశీర్వచనం అమ్మవారి చిత్రపటం, ప్రసాదములు అందజేశారు.



# రాజకీయ లబ్ధి కోసమే హారిక దంపతులు డ్రామాలు

- **గుడివాడ టిడిపి పార్టీ మహిళలు**



**గుడివాడ, జూలై 13 (మనం న్యూస్):** పేర్ని నాని గుడివాడ వచ్చి ఉంటే రప్పా రప్పా ఏంటో చూపించే వాళ్ళమని గుడివాడకు చెందిన టిడిపి మహిళలు హెచ్చరించారు. ఆదివారం నాడు గుడివాడ టిడిపి కార్యాలయంలో తెలుగు మహిళల ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించి వారు మాట్లాడారు. కొడాలి నానినే పారిపోతే గుడివాడలో మీటింగులు మీకెందుకు వారు ప్రశ్నించారు. ఎమ్మెల్యే రాము ఆదేశాలతోనే మేమంతా సమన్వయంతో ఉన్నామన్నారు. లేకుంటే వైసీపీ సమావేశం నిన్న జరిగి ఉండేది కాదన్నారు. మహిళా అనే గౌరవంతో ఇతర మార్గాల్లో కేకన్వెన్షన్ కు వెళ్లాలని ఉప్పాల హారికాకు పదేపదే చెప్పామన్నారు. కానీ వెనక్కి వెళ్తున్నామని కొద్ది దూరం వెళ్లి తిరిగి ప్రణాళికతోనే ఆందోళన చేస్తున్న ప్రాంతానికే వచ్చారని అన్నారు. అభ్యంతర పదజాలంతో రాము దంపతులు తమను పదేపదే దూషించారని అన్నారు. ఉప్పాల హారికను టిడిపి శ్రేణులు ఎవరు పల్లెత్తు మాట అనలేదన్నారు. బందరులో ఉప్పాల హారిక ఫ్లెక్సీ కడతానంటే ఊరుకోనన్న పేర్ని నాని, నాటి రోజులు మర్చిపోయాడా అని ప్రశ్నించారు. గుడివాడ వస్తే పేర్ని నానీకు మా తడాఖా ఏంటో చూపించే వాళ్ళమంటూ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మీటింగ్ లో పాల్గొంటే పరిణామాలు ఎలా ఉంటాయో తెలిసి కొడాలి నాని పారిపోయాడని అన్నారు. మూడు రోజులుగా పేర్ని నాని ఎలాంటి పిచ్చి కూతలు కూర్చున్నాడో అందరం వింటున్నామన్నారు. ఈ సమావేశంలో టిడిపి మహిళా నాయకులు యార్లగడ్డ సుధారాణి, కొల్లి రమ్య, మాదల సునీత, సిరిపిరపు తులసిరాణి,మల్లికా బేగం, తుము పద్మజ,పొట్లూరి రమదేవి,వీరమాచినేని శైలజ తదితరులు పాల్గొన్నారు.

# మంచిగా బతకండి, పదిమందితో మంచి అనిపించుకోవాలి

- **విజయవాడలో రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించిన పోలీసులు**



**విజయవాడ పశ్చిమ, జూలై 13 (మనం న్యూస్):** విజయవాడ పరిదిలోని రౌడీ షీటర్లకు పోలీసు అధికారులు ఆదివారం నాడు విజయవాడ సత్యనారాయణ పురం పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో కౌన్సిలింగ్ ఇచ్చారు. పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు ఆదేశాల మేరకు ఏసిపి స్రవంతి రాయ్, స్థానిక సీఐ లక్ష్మీనారాయణ, సిసిఎస్ సి ఐ శ్రీనివాస్ లు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఏసిపి స్రవంతి రాయ్ ఈ సందర్భంగా రౌడీషీటర్లతో మాట్లాడుతూ మిమ్మల్ని రౌడీషీటర్ లు అనిపించుకోవడం సిగ్గుగా లేదా..?, మీ కుటుంబాన్ని సమాజంలో ఏ విధంగా చూస్తారు..? అని ప్రశ్నిస్తూ చెడ్డ పనులకు దూరంగా ఉండాలని సూచించారు. త్వరగా ఈ రౌడీ షీట్ నుంచి ఉపసంహరణ పొందే విధంగా ప్రవర్తించండిని హెచ్చరించారు. మంచి పనులకు ఎప్పుడు పోలీస్ సహకారం ఉంటుందన్నారు. రౌడీ షీటర్లలో మంచిగా బతకాలని ఆలోచన వచ్చే విధంగా వారిలో పెంచే విధంగా ఆమె చేసిన సూచనలు రౌడీ షీటర్ లో మార్పు వచ్చేందుకు నాంది పలికినట్టుగా కనిపించాయి. ముందుగా ఈ కౌన్సిలింగ్ ఎందుకు ఎంతమంది వచ్చారు..? వారి పూర్తి వివరాలు సేకరించారు. ఈసారి ఓ మహిళా సస్పెక్ట్ ఆదివారం కౌన్సిలింగ్ కు హాజరు కావడం విశేషం. ఎస్సై షబ్బీర్, స్థానిక స్టేషన్ పోలీస్ సిబ్బంది ఈ కౌన్సిలింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# విజయవాడలో వైసిపి చంద్రబాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ సమావేశం



**విజయవాడ పశ్చిమ, జూలై 13 (మనం న్యూస్):** స్థానిక బ్రాహ్మణ వీధిలోని వైసిపి విజయవాడ పశ్చిమ కార్యాలయం నందు అదివారం నాడు 2వ క్లస్టర్ అధ్యక్షులు వాసా ఆదినారాయణ బాబు ఆధ్వర్యంలో చంద్రబాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ, చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ 2వ క్లస్టర్ విస్తృత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసారు. ఈ సమావేసానికి మాజీ మంత్రి, పశ్చిమ వైసిపి ఇంచార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు , కార్పొరేటర్లు బండి పుణ్యశీల, శిరంశెట్టి పూర్ణచంద్రరావు, యలకల చలపతిరావు, 2వ క్లస్టర్ వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తొలుత దివంగత మహానేత డా వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పులా మాల వేసి ఘన నివాళులర్పించారు. బాబు మోసాలను, ప్రజలకు ఇచ్చిన బాండ్లు, వైయస్ జగన్ గారి ప్రెస్ మీట్ ని టివిలో చూపించారు. ఇంటింటికి క్యూ ఆర్ కోడ్ తో వెళ్లి ప్రజలతో ఆ క్యూ ఆర్ కోడ్ ని స్కాన్ చేపించి కూటమి మోసాలను వివరించాలని కోరుతూ క్యూ ఆర్ కోడ్ ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ చంద్రబాబు మోసపూరిత హామీలను, తప్పుడు వాగ్దానాలను ప్రజలకి గుర్తుకు తెచ్చేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. గతంలో వైసిపి హయాంలో ప్రతి గడపకు వెళ్లి ఇచ్చిన హామీలు అమలు చేసిన సంక్షేమ పథకాలు అందాయ లేదా అని ప్రజలనడిగి తెలుసుకొని రానివాళ్ళకి  అక్కడికక్కడే పరిష్కారం చేసామన్నారు. డివిజన్ స్థాయిలో ప్రజలందరికి చంద్రబాబు మోసాలను, హామీలను, మేనిఫెస్టోను గుర్తుకు చేసి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలనీ పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీలోని వివిధ హోదాలలో పదవులు పొందిన వారు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి సమస్యను పరిష్కరించే దిశగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

- **విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**



**విజయవాడ సెంట్రల్, జూలై 13 (మనం న్యూస్):** ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని వెంటనే పరిష్కరించే దిశగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను ఈ సోమవారం కూడా విజయవాడ నగరపాలక సంస్థ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయంలో కూడా నిర్వహిస్తున్నట్లు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర  ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ నగరపాలక సంస్థ  కు సంబంధించిన సమస్యలన్నీ  ప్రజలు తమ దగ్గరలోని కార్యాలయంలో సంప్రదించవచ్చని ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 1:00 వరకు ఫిర్యాదులను స్వీకరిస్తారని అధికారులందరూ జోనల్ కార్యాలయలతో పాటు ప్రధాన కార్యాలయంలో కూడా అందుబాటులో ఉంటారని, కావున ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

# కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



**హనుమాన్ జంక్షన్, జూలై 14(మనంన్యూస్):** శంకర్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ అండ్ రీసెర్చ్ సెంటర్ తేలప్రోలు సహకారంతో బాపులపాడు వైస్ ఎంపీపీ  చందు  శ్రీనివాసరావు రమాదేవి ఆధ్వర్యంలో కోడూరుపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరంనికి గ్రామస్తుల నుంచి విశేష స్పందనను లభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రిటైర్డ్ నాసా శాస్త్రవేత్త అమెరికా  చందు సాంబశివరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.  ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ,గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన ఆరోగ్యసేవలు అందించాలన్న దృఢ సంకల్పంతో శంకర్ గ్రూప్ వారు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయం అని అన్నారు.డాక్టర్లు మరియు  సిబ్బంది ఎంతో నిబద్ధతతో పనిచేస్తున్నారని ఈ తరహా సేవల ద్వారానే మానవత్వం వెలుగుతుందని ప్రశంసించారు. ఈ ఉచిత మెగా వైద్య శిబిరంలో 300 మందికి పైగా కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. పరీక్షల అనంతరం కొంతమందికి కళ్ళజోడు అవసరమని డాక్టర్ సూచించడంతో, చందు శ్రీనివాసరావు , తాతారావు తన సొంత డబ్బుతో కొంతమందికి ఉచితంగా కళ్ళజోళ్ళను అందించేందుకు ముందుకు వచ్చారు.అవసరమైన మరికొందరికి అతి తక్కువ ధరలకే  కళ్ళజోళ్ళు అందించడం జరిగింది. అదే విధంగా  ఆపరేషన్ అవసరమని గుర్తించి 38 మందికి  శంకర గ్రూప్ డాక్టర్లు ఉచితంగా ఆపరేషన్ చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో  ఎంపీపీ నగేష్ , నక్కా గాంధీ ,  కసుకుర్తి శ్రీనివాసరావు, నూకల బాలాజీ , నూకల గోవిందయ్య , గరికిపాటి ప్రసాదు, ఇడదల నాగు అంబటి రంగారావు , మోర్ల ఆంజనేయులు , గ్రామ ప్రజలు మరియు శంకర గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన వైస్ ఎం పి పి చందు శ్రీనివాసరావు రమాదేవి దంపతులను పలువురు సన్మానించారు.

# దుర్గమ్మకు భక్తనీరాజనం



**విజయవాడ పశ్చిమ, జూలై 13 (మనం న్యూస్):**  ఆషాఢ సారె సమర్పణకు రెండు తెలుగు రాష్ట్రాల నుండి భక్తుల రాకతో ఆదివారం నాడు ఇంద్రకీలాద్రికి భక్తులు పోటెత్తారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల వరకు 57 వేల 419 మంది భక్తులు వచ్చినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అనూహ్యంగా పెరిగిన భక్తుల రద్దీ తో దర్శనం టికెట్ లు రద్దు చేసి, భక్తులందరికి ఈవో శీనానాయక్ ఉచిత దర్శనం ఏర్పాటు చేశారు. 2017 లో మొదటి సారి దుర్గమ్మకు సారె సమర్పణ కార్యక్రమాన్ని మాజీ ఈవో, ఐ ఏ యస్ అధికారి అడపాల సూర్యకుమారి ప్రారంభించారు. సారె సమర్పణకు ప్రతీ యేటా భక్తుల సంఖ్య పెరుగుతూ ప్రస్తుతం భక్తుల సంఖ్య మరో భవాని దీక్షలను తలపిస్తుంది. జూన్ 26 నుండి ప్రారంభమయిన ఈ విశ్వావసు నామ సంవత్సర ఆషాఢ సారె సమర్పణ కు ఆదివారం వరకు 18 రోజులకు కేవలం సారె సమర్పణకే 4.15 వేల మంది భక్తులు విచ్చేసినట్లు, అందులో  98 శాతం మహిళలే ఉన్నట్లు సమాచారం. కనకదుర్గమ్మ వారిని ఇంటి ఇల వేల్పుగా, ఆడపడుచుగా భావిస్తూ పసుపు, కుంకుమలు, గాజులు, చీర,సారెలతో ఇంద్ర కీలాద్రికి భక్తులు తరలి వస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం క్యూలైన్లలో మంచినీరు సరఫరా, మరుగుదొడ్లు, మౌలిక సదుపాయాలను అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్, సూపరెండెంట్స్, ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేశారు. భక్తుల రద్దీ, ఎండ తీవ్రత గమనించి  ఉచితంగా బిస్కెట్ ప్యాకెట్స్, మంచి నీటి బాటిల్స్ పంపిణీకి ఈవో శీనానాయక్ ఆదేశాలు జారీ చేశారు. భక్తుల రద్దీ నియంత్రణ లో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం సీసీ కెమెరాల్లో చూసి వైర్ లెస్ సెట్ లు ద్వారా సిబ్బంది కి సూచనలు చేస్తూ ఎక్కడికక్కడ రద్దీ నియంత్రణ చేశారు. 50 వేల మంది భక్తులు వచ్చినా ఎవరికీ ఎటువంటి ఇబ్బంది లేకుండా సమన్వయముతో దేవస్థానం అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించారు. ఎండ తీవ్రత రీత్యా చిన్న రాజగోపురం వద్ద, పెద్ద రాజ గోపురం ముందు అప్పటికప్పుడు షామియానా, కాళ్ళు కాలకుండా కనకదుర్గా నగర్, ఘాట్ రోడ్లలో వాటరింగ్ ఏర్పాటు చేశారు. ఉచిత ప్రసాదం, అన్న ప్రసాదం కంటిన్యూ గా ఉదయం నుండి అందేలా చర్యలు తీసుకున్నారు. భక్తులరద్దీ కి తగ్గట్లు పారిశుధ్య, రవాణా ఏర్పాట్లు చేశారు.

# ఉత్సాహంగా ఆత్మీయ సమ్మేళనం



**హనుమాన్ జంక్షన్, జూలై 13(మనంన్యూస్):** బాపులపాడు లోని ఐసీఎం జూబ్లీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం సందడిగా సాగింది.1994 లో పదో తరగతి పూర్తి చేసుకున్న నాటి విద్యార్థులంతా తాము చదివిన పాఠశాలలోనే ఆత్మీయంగా కలుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించి, వారికి పాదపూజ చేశారు. తామందరం ప్రయోజకులై ఉన్నత స్థాయికి చేరుకోవడానికి మీ బోధన, విలువల ఆచరించేలా తీర్చిదిద్దడమే కారణమంటూ కృతజ్ఞతలు తెలియజేశారు. సహచర విద్యార్థులతో కలిసి నాటి, నేటి అనుభూతులు, ముచ్చట్లు గురించి చెబుతూ సరదాగా గడిపారు.కలిసి భోజనం చేశారు.  అనంతరం తమ అపూర్వ కలయికను పదిలం చేసుకుంటూ గ్రూప్ ఫోటోలు దిగారు. తరువాత ఆటపాటలతో సందడి చేశారు.. మేడేపూడి వెంకటేశ్వరరావు, కలపాల మోహనకుమార్ సమన్వయకర్తలుగా వ్యవహరించగా, సకలాపురపు శ్రీను,కొల్లి హరి కృష్ణ,మల్లిశెట్టి సుబ్రమణ్యం,కొలవెంటి సునీల్,లింగినీడీ ఉమరఘురాం, ముప్పాళ్ల కిరణ్ కుమార్, మంగలపాటి రవి, జుజ్జువరపు విశ్వేశ్వరరావు,రామిరెడ్డి, హిల్స్ బాబు,వరలక్ష్మి, విజయ,సుమతి, అనసూయ,షాలేం, నీలిమ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

# తెలుగు భాష పరిరక్షణకు కోట తోడ్పాటునిచ్చారు

- **కోట అవనిగడ్డ హైస్కూలులో ఎస్.ఎస్.ఎల్.సీ చదివారు**
- **కోట చిత్రపటానికి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ఘన నివాళి**

**అవనిగడ్డ, జూలై 13 (మనం న్యూస్):** తెలుగు భాషా పరిరక్షణకు కోట శ్రీనివాసరావు అసెంబ్లీలో తనకు తోడ్పాటుగా నిలిచారని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ స్మరించుకున్నారు. ఆదివారం అవనిగడ్డలోని ఎమ్మెల్యే కార్యాలయంలో కోట శ్రీనివాసరావు సంస్మరణ సభ నిర్వహించారు. కోట శ్రీనివాసరావు చిత్రపటానికి బుద్ధప్రసాద్ ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ 1999లో విజయవాడ తూర్పు ఎమ్మెల్యేగా కోట శ్రీనివాసరావు,  అవనిగడ్డ ఎమ్మెల్యేగా తాను ఒకేసారి గెలిచి అసెంబ్లీకి వెళ్లినట్లు తెలిపారు. పార్టీలు వేరైనా తమ ఇద్దరి మధ్య భావ సారూప్యత ఉండేదన్నారు. సమస్యలపై అసెంబ్లీలో తన గళం వినిపించే వారన్నారు. ఎమ్మెల్యేగా అసెంబ్లీకి, జిల్లా అభివృద్ధి ప్రణాళిక సమావేశాలకు కోట శ్రీనివాసరావు క్రమం తప్పకుండా హాజరయ్యే వారన్నారు. ఇటు ప్రజా ప్రతినిధిగా, అటు నటునిగా రాజకీయ, సినీ రంగాలకు విస్తృత సేవ చేసిన గొప్ప వ్యక్తి కోట శ్రీనివాసరావు అని తెలిపారు. ఒకటవ తరగతి నుంచి పదో తరగతి వరకు తెలుగు భాషను విధిగా బోధించాలని తాను అసెంబ్లీలో అనధికార తీర్మానం ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. సాధారణంగా అనధికార తీర్మానాలు చర్చకు రావని, అయితే తాను ప్రవేశపెట్టిన ఈ తీర్మానం చర్చకు రావడంతో మరో ఎమ్మెల్యే మద్దతు కోసం తాను కోట శ్రీనివాసరావును కోరిన వెంటనే ఆయన వెంటనే అంగీకరించి, చర్చలో పాల్గొన్నారన్నారు. తెలుగు భాషలో బోధన ఆవశ్యకతను, తెలుగు భాష పరిరక్షణ అవసరాన్ని, విద్యార్థి దశలో తెలుగు లేకపోతే జరిగే నష్టాన్ని గురించి అసెంబ్లీలో కోట శ్రీనివాసరావు అద్భుతంగా ప్రసంగించారని స్మరించుకున్నారు. తన అనధికార తీర్మానానికి కోట శ్రీనివాసరావు ఇచ్చిన సంపూర్ణ మద్దతు కారణంగా ఆనాడు రాష్ట్ర ప్రభుత్వం తెలుగు భాష పరిరక్షణకు ఉత్తర్వులు ఇచ్చిందని గుర్తు చేసుకున్నారు. నటునిగా కోట శ్రీనివాసరావు ఎంచుకున్న ప్రతి పాత్రలో పరకాయ ప్రవేశం చేసేవారన్నారు. తమ ఇంటి ముందు వీధిలో ఉంటూ అవనిగడ్డ, కోడూరుల్లో వైద్యునిగా విధులు నిర్వహించిన డాక్టర్ పీ.ఆర్.కే శర్మకు కోట శ్రీనివాసరావు బావమరిది అవుతారని, కోట శ్రీనివాసరావు వారి ఇంట్లో ఉంటూ ఇక్కడి హైస్కూలులో ఎస్.ఎస్.ఎల్.సీ చదివినట్లు కోట శ్రీనివాసరావు ప్రతిసారీ తనకు చెప్పే వారని స్మరించుకున్నారు. కోట శ్రీనివాసరావు మృతి తనకు తీరని లోటు అన్నారు. ఆయన మృతికి తన ప్రగాఢ సంతాపం కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు, డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

